సన్మానం



చిక్కడపల్లి: సిటీ సివిల్ కోర్టు ప్రభుత్వ అసిస్టెంట్ ప్లీడర్‌గా నియమితులైన న్యాయవాది వెంకట రమణ యాదవ్‌ను బుధవారం కాంగ్రెస్ నేతలు గాంధీనగర్‌లో ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. తనకు ఈ పదవీ రావడం మరింత బాధ్యతను పెంచిదని చట్టాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మారిశెట్టినర్సింగ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పాశం అనిల్‌కుమార్ యాదవ్, గుండు జగదీశ్‌బాబ, సాయి(బాబ్జీ), సురేష్‌కుమార్, బాబురావు, రాజేందర్‌రెడ్డి, భీమన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ముషీరాబాద్: రాజ్యసభ సభ్యుడు, ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.లక్ష్మణ్ బుధవారం రాంనగర్‌లోని బీజేపీ సీనియర్ నేత కత్తి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల కత్తి లక్ష్మీనారాయణ తల్లి కమలమ్మ మరణించారు. కమలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గడ్డం నవీన్, రఘునాథ్, విశాల్, రాపర్తి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళనకు ముందడుగు

- రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, పోలీస్ విభాగాల సంయుక్త సర్వే
- ఇప్పటికే 90 శాతం పూర్తయిన సర్వే
- సూచన ప్రాయంగా మార్కింగ్

చాదర్‌ఘాట్ నుంచి మూసారంబాగ్ వరకు 3కిలో మీటర్ల మేర సర్వే



మూసీ పరివాహక ప్రాంతమైన గోల్నాక కమలానగర్





మూసీనది ప్రక్షాళన సర్వేలో భాగంగా పరివాహక ప్రాంతాల్లో మార్కింగ్ చేసిన భవనాలు

అంబర్‌పేట: మూసీ నది ప్రక్షాళనకు అడుగులు పడుతున్నాయి. అంబర్‌పేట నియోజకవర్గం ప్రాంతాల గుండ వెళుతున్న మూసీనది ప్రక్షాళన కోసం రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించారు. నియోజకవర్గంలో చాదర్‌ఘాట్ బ్రిడ్జ్ నుంచి మూసారంబాగ్ బ్రిడ్జ్ దాటి కొంత వరకు మూసీనది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ పరివాహక ప్రాంతంలో కృష్ణనగర్, కామ్‌గార్‌నగర్, గోల్నాక కమాలనగర్, దుర్గానగర్, న్యూ దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో సర్వే జరిగింది.

☛ ఈ ప్రాంతాల్లో సూమారు 1100 ఆస్తులను సేకరించేందుకు నివేదిక సిద్ధం అవుతోంది. ఇప్పటి వరకు రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, పోలీస్ విభాగాలు సంయుక్తంగా దాదాపు 90శాతం సర్వే పూర్తి చేశారు. చాదర్‌ఘాట్ బ్రిడ్జ్ నుంచి అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో మూసీనది సుమారు 3కిలో మీటర్ల మేర ప్రవహిస్తుంది. ఈ పరివాహక ప్రాంతంలో మూసీ ప్రక్షాళన కోసం కసరత్తు ప్రారంభించారు.

అడ్డంకులను తొలగించడం సవాలే....

మూసీ పరివాహక ప్రాంతంలో ఉంటున్న ప్రజలు అంతా పేద మధ్య తరగతి వారే. కొన్ని గ్రాసింగ్ పట్టా భూములు, మరికొన్ని ప్రభుత్వ భూముల్లో ఏళ్ల క్రితమే వెంచర్‌లు వేసి పేదలకు విక్రయించారు. ఏళ్ల తరబడి పేదలు మూసీ పరివాహక ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని నివాసిస్తున్నారు. వారిని మూసీ ప్రక్షాళన కోసం తరలించడం పెద్ద సవాలే. వందలాది కుటుంబాలు ఖాళీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం గుర్తించి వారికి ఎలాంటి నష్ట పరిహారం ఇస్తారో వేచి చూడాల్సిందే. ఇప్పటికే సర్వే చేయడంలో ఇక్కడి నివాసితులు ఆందోళనకు గురవుతున్నారు. ఆందోళన చెందుతున్న వారికి ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇస్తుందో చూడాలి.

ప్రభుత్వ ఆదేశాలతో సర్వే..



ప్రభుత్వ ఆదేశాలతో తమ పరిధిలో ఉన్న మూసీ పరివాహక ప్రాంతాన్ని సర్వే చేస్తున్నాం. ఇప్పటికే 90 శాతం సర్వే పూర్తయ్యింది. ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు సూచన ప్రాయంగా నివేదిక తయారు చేస్తున్నాం. బఫర్ జోన్, మూసీ ప్రక్షాళన వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నాం.

- వీరాబాయి, అంబర్‌పేట తహసీల్దార్

నివాసితులకు అన్యాయం చేయొద్దు..



మూసీ పరివాహక ప్రాంతంలో అనేక ఏళ్ల తరబడి పేదలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వారికి అన్యాయం చేయొద్దు. అత్యుత్సాహంతో అక్కడ నివాసిస్తున్న పేదలను అవసరం లేకున్నా ఖాళీ చేయించొద్దు. అక్కడ నివసిస్తున్న పేదలకు అన్యాయం జరగకుండా అండగా ఉంటాం.

- మహేందర్, అంబర్‌పేట సీపీఎం కన్వీనర్

రైతు రుణమాఫీ చరిత్రాత్మకం

కాచిగూడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన రైతు రుణమాఫీ నిర్ణయం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్ల రుణాన్ని మాఫీ చేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు విడతలుగా ఆగస్టు నాటిని రుణమాఫీని చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. ప్రజా సంక్షేమం, పథకాల అమలుకు గడిచిన ఆరు నెలల్లో రూ.30వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీలం వెంకటేష్, కోలా జనార్ధన్, నందగోపాల్, వేముల రామకృష్ణ, ఉదయ్, శివమ్మ, ప్రణీత, హరితిలక్ సింగ్ తదితరలు పాల్గొన్నారు.

ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా రాంబాబు



ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా 2002 బ్యాచ్‌కు చెందిన రాంబాబు బాధ్యతలు బుధవారం స్వీకరించారు. నగరంలో నారాయణగూడ, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లలో డీఐగా, కామాటిపురా పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా రాంబాబు పని చేశారు.

ఆరు నెలల్లో ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ...

జనవరి నుంచి జూలై వరకు సుమారు ఆరు నెలల కాలంలో ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పని చేసిన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు వెంటవెంటనే బదిలీ కావడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సుదీర్ఘ కాలం ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన జహంగీర్‌యాదవ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో గాంధీనగర్‌లో ఓ రాజకీయ పార్టీ నుంచి డబ్బులు స్వాధీనం చేసుకున్న ఘటనలో సకాలంలో కేసు నమోదు చేయలేదనే కారణంతో ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్, సెంట్రల్ జోన్ డీసీపీని ఒకేసారి ముగ్గురుని సస్పెండ్ చేయడం అప్పట్లో సంచలనంగా మారింది.

హయ్యర్ పెన్షన్‌కు అందరూ అర్హులే..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్, ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సుప్రీం కోర్టు తీర్పు అమలు – హయ్యర్ పెన్షన్ సమస్యలపై రాష్ట్ర సదస్సును నిర్వహించారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా సీఐటీయూ జాతీయ కార్యదర్శి, పీఎఫ్ బోర్డు సభ్యులు ఆర్.కరుమలయన్ హాజరై మాట్లాడారు. పెన్షనర్స్‌పై సర్క్యులర్స్ పరిశీలించాలని హయ్యర్ పెన్షన్‌పై సుప్రీంకోర్టు తీర్పును పరిశీలిస్తే అందరూ అర్హులే అని చెప్పారు. పీఎఫ్ ట్రస్టులో రూ.25 లక్షల కోట్లు జమ అయ్యిందన్నారు. ఇది దక్షిణ భారత రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువ అని పేర్కొన్నారు. వేతన సవరణ అనంతరం పెన్షన్ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు వీరంజనేయులు, ఏపీఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు జిలానీ పాషా, టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఉద్యమకారుల సమితి నేత సుల్తాన్ యాదగిరి

కాచిగూడ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల్లో పాల్గొని ఆర్థికంగా నష్టపోయిన... వివిధ పోలీస్ స్టేషన్లు, కోర్టు కేసుల్లో ఉన్న, జైళ్లకు వెళ్లి వచ్చిన ఉద్యమకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాని తెలంగాణ ఉద్యమకారుల సమితి నేత సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రౌండ్ టేబుల్ సమావేశంలో తీసుకున్న తీర్మానాలను వెల్లడించారు. తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న పోలీస్ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో ప్రభుత్వం గుర్తించిన కొన్ని కుటుంబాలను ఆదుకున్నారు, మిగతా కుటుంబాలను పూర్తిగా ఆదుకోవాలని అన్నారు.

☛ తెలంగాణ సమరయోధుల విస్తృత కమిటీనీ అధికారికంగా ప్రకటించాలన్నారు. తొలి, మలి దశ ఉద్యమకారులకు గుర్తింపు తామర పత్రాలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేసిన దాని ప్రకారం తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం వెంటనే ఇవ్వాలని అన్నారు. ఉద్యమకారులకి పింఛన్ పథకం కింద నెలకు రూ.30వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, ఆరోగ్య బీమా పథకం కింద రూ.20 లక్షల వరకు ఇవ్వాలని.. విద్యా, ఉద్యోగాలలో ఉద్యమకారుల కుటుంబాలకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని.. ప్రభుత్వ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 200 ఎకరాల్లో అమర వీరుల స్మృతి వనం ఏర్పాటు చేయాలని కోరారు.

200 యూనిట్‌ల ఉచిత విద్యుత్‌ను అమలు చేయాలి

ముషీరాబాద్: ప్రభుత్వం పేదలకు 200ల యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా జీవో బిల్లును తప్పనిసరి అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్, ఇందిరానగర్‌లో సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కృష్ణ, రాములు మాట్లాడుతూ.. మహాత్మానగర్, ఇందిరానగర్‌లో 200ల యూనిట్లలోపు విద్యుత్ బిల్లు వచ్చినప్పటికీ బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ బిల్లులు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేస్తున్నారనని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మహాత్మాగాంధీనగర్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఎన్నికలపై అనుమానాలను నివృత్తి చేయాలి

లిబర్టీ: ఎన్నికల ఫలితాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మళ్లీ లెక్కించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే జోక్యం చేసి తిరిగి లెక్కించి అను మానాలను నివృత్తి చేయాలని కోరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని టెస్లా అధి నేత ఎలాన్‌మస్క్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం మళ్లీ ఓట్లను లెక్కిస్తే తప్ప వివిధ వర్గాలు, మేధావుల్లో ఉన్న అనుమానాలు నివృత్తి అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈవీఎంలను కేంద్ర ఎన్నికల సంఘం ప్ర త్యేక బృందం ఆధ్వర్యంలో మళ్లీ లెక్కిస్తే అనుమానాలు తీరుతాయన్నారు.

ఆగస్టు 1న హంస, సింహ అవార్డ్స్ ప్రదానోత్సవం

హిమాయత్‌నగర్: వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన ప్రముఖులకు హంస, సింహ -2024 పేరుతో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆ లూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్, ఫ్రెండ్షిప్ మినీస్ట్రీస్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆలూరి విల్సన్ తెలిపారు. ఆగస్టు 1వ తేదీన హిమాయత్‌నగర్‌లోని ఎలివేట్స్ కల్చరల్ ఎలైట్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సేవా, కళ, సాహిత్యం, సినీ, టీవీ, థియేటర్, షార్ట్ ఫిల్మ్, థియేటర్, వాస్తు నిపుణులు, జ్యోతిష్యులు, జర్నలిస్ట్, డాక్టర్, లాయర్, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యావేత్తలు వ్యవసాయ రంగం, చేనేత రంగం, క్రీడలతో సహా వివిధ రంగాలకు చెందిన వారు ఈ అవార్డులకు అర్హులని ఎంట్రీల నమోదుకు జులై 25 చివరి తేదీ వరకు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు డా. ఆలూరి విల్సన్ 9396610766, 9494861669 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

వీధి లైట్లు వెలగవు.. కరెంటోళ్లు పట్టించుకోరు!



నల్లకుంట శంకరమఠం మెయిన్ రోడ్డులో అలుముకున్న చీకట్లు

నల్లకుంట: విద్యుత్ శాఖ స్ట్రీట్ లైట్స్ విభాగం అధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా నల్లకుంట డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలలో వీధిలైట్లు వెలగడం లేదు. డివిజన్ పరిధిలోని పాతరామాలయం వీధి, మహేష్ పాన్‌షాప్ లేన్‌లో కొన్ని రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో వీధుల్లో అంధకారం అలుముకుంటుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వీధులు వరద నీటితో ముంచెత్తున్నాయి. వీధి లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు చీకట్లో ఏ మ్యాన్‌హోల్‌లో పడి ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వీధి లైట్లు వెలగడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ స్ట్రీట్ లైట్స్ విభాగం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే నల్లకుంట శంకరమఠం ప్రధాన రహదారిలో కూడా తరుచూ వీది లైట్లు వెలగడం లేదని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ట్యాంక్‌బండ్‌పై ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు కృషిచేస్తాం



ట్యాంక్‌బంగ్‌పై ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బెల్లయ్య నాయక్, ఎరుకల సంఘం నేతలు

కవాడిగూడ: ఎరుకల జాతి మూల పురుషుడు ఏకలవ్య విగ్రహాన్ని నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసే విధంగా తమ వంతు కృషిచేస్తానని తెలంగాణ గిరిజన కోఆపరేటీవ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ పేర్కొన్నారు. తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్‌బండ్‌పై ఏకలవ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు సదానందం, కోనేటి నర్సింహ, రవికుమార్, వనం రమేష్, ఆనంద్, పుత్తాడి సురేష్, మొగులయ్య, మహిళా అధ్యక్షురాలు భవాని, రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



బాధితుడికి ఫోన్‌ను అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: సెల్‌ఫోన్ దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏ.సీతయ్య అన్నారు. చిక్కడపల్లిలో నివసించే ఆనంద్ 20 రోజుల క్రితం తన సెల్‌ఫోన్ పోయిందని పోలీస్ సేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బుధవారం సాయంత్రం ఆనంద్‌కు అందజేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నిరుద్యోగులకు అండగా ఉంటాం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో నిరుద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుదని ఎవరూ అధైర్యపడవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి నేతృత్వంలో విద్యార్థులు మంత్రిని కలసి నిరుద్యోగుల సమస్యలను వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, వైద్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అధిక ప్రాధానత్యను ఇవ్వనున్నట్లు మంత్రి హామి ఇచ్చిన్నట్లు తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో పులిగంటి వేణుగోపాల్, శివశంకర్, సురేష్, రవీందర్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం



భోలక్‌పూర్‌లోని అఖిల్‌షా దర్గా వద్ద పీర్లకు దట్టీలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మొహర్రం పండగను పురస్కరించుకొని బుధవారం భోలక్‌పూర్‌లోని అఖిల్‌షా దర్గాలో బుధవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం పీర్లకు దట్టీలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో మొహరం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారని తెలిపారు. అదే విధంగా బడీ మసీదు, గుల్షన్‌నగర్, దాయార మార్కెట్ తదితర ప్రాంతాల్లో పీర్లకు బీఆర్ఎస్, స్థానిక నాయకులు దట్టీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, రహీం, మూసా, ఖాజామొహియుద్దీన్, యాదగిరి, మక్బుల్, జబ్బార్, రహీం, ఆర్.శ్రీనివాస్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



బడి మసీదు సమీపంలోని దర్గాలో బీఆర్ఎస్ నాయకుల ప్రార్థనలు



గుల్షన్‌నగర్‌లో మహిళలకు షర్బత్ పంపిణీ చేస్తున్న అక్లాక్ హుస్సేన్

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



డీడీ కాలనీలోస్వామివారికి పూజాలు చేస్తున్న వేద పండితులు



ఆహోబిలం మఠంలో తొలి ఏకాదశి వేడుకల్లో భక్తులు



కాచిగూడలో జరిగిన పూజలో కార్పొరేటర్ కన్నె ఉమారాణి దంపతులు

ఆషాఢ శుద్ధ ఏకాదశినే 'తొలి ఏకాదశి'అని అంటారు. దీనినే శయన ఏకాదశి అని పిలుస్తారు. ఈరోజు నుంచి శ్రీమహా విష్ణువు క్షీరాబ్దిలో శేషపాన్పుపై శయనిస్తారని పండితులు చెబుతారు. అంతేకాకుండా ఈ తొలి ఏకాదశికి ఓ ప్రత్యేకత ఉంది. ఈ రోజు నుంచి ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు దక్షిణ దిశకు వాలుతున్నట్లు కనిపిస్తాడు. ఇది దక్షణాయన ప్రారంభాన్ని సూచిస్తుందని ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు. చాతుర్మాస్య దీక్ష తీసుకునే వారు ఈరోజు నుంచే వ్రతం ప్రారంభిస్తారు. ఇతంటి ప్రత్యేక రోజు కావడంతో బుధవారం అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ల పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ బృందం



న్యూరామాలయంలో సీతారామచంద్ర మూర్తికి పూజలు



చిక్కడపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



లక్ష్మీ, పద్మావతి వేంకటేశ్వరస్వామిలకు అభిషేకం



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో పూజలు



ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు



గాంధీనగర్ సంగమేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కవాడిగూడ డివిజన్‌లో ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ రచనశ్రీ